# అనకాపల్లిలో అడ్డగోలు నిర్మాణాలు

## ఇంటి నిర్మాణ ప్లాన్‌తో కళ్యాణ మండపం పంట కాలువ సైతం ఆక్రమణ ప్రశ్నిస్తున్న అధికారులకు బెదిరింపులు

విశాలాంధ్ర - అనకాపల్లి: బరితెగింపు, చట్టాలు బేఖాతరు, ప్రభుత్వ ఆదాయానికి గండి ఇలా అడుగడుగునా నిబంధనలను తుంగలోకి తొక్కి ప్రశ్నిస్తున్న అధికారులను బెదిరిస్తూ అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణదారుల వింతవైఖరి రోజురోజుకు పెచ్చుమీరిపోతుంది. రింగ్ రోడ్డులోని ఇంటి ప్లాన్ కోసం అనుమతి తీసుకొని ఏకంగా కళ్యాణ మండపం నిర్మించేస్తున్నారు. పట్టణంలో రింగురోడ్డు బెల్లం మార్కెట్ సమీపంలో కన్వెన్షన్ పేరుతో ఉన్న కళ్యాణ మండపం నిబంధనలను అతిక్రమించి నిర్మించినట్లు సర్వత్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వాన్ని మోసం చేసి సుమారు కోటి రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి రెసిడెన్షియల్ ప్లాన్‌తో (డార్మెట్రీకి కూడా ఉపయోగించుకోవచ్చు) ఏకంగా భారీ కళ్యాణ మండపం నిర్మించి తిరిగి ప్రశ్నిస్తున్న అధికారులను బెదిరిస్తున్న కళ్యాణ మండప యాజమాన్యం తీరుపై అధికారులు ఆగ్రహంగానే ఉన్నారు. ఇప్పటికే పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక కార్య కర్తలు అడ్డగోలు కళ్యాణ మండపం నిర్మాణంపై ఫిర్యా దులు కూడా చేశారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేయడమే కాకుండా పంట కాలువను సైతం ఆక్రమించి దాన్ని రహదారిగా ఉప యోగించుకుంటూ బరి తెగింపునకు పాల్పడ్డాడు. జీవీఎంసీ కమిషనర్ సదరు అక్రమ కళ్యాణ మండప విషయంలో ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అక్రమ నిర్మాణంలో అధికారిక కార్యక్రమాలు**

ప్రభుత్వాన్ని మోసం చేసి అక్రమంగా నిర్మించిన కళ్యాణమండపంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలను

నిర్వహించడం పట్ల జిల్లా ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అవగాహన రాహిత్యమో, అనాలోచిత నిర్ణయమో తెలియదు కానీ ఇలాంటి అక్రమ నిర్మాణంలో ప్రభుత్వ కార్యక్రమాలు చేయడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది అంతేకాకుండా ఇలాంటి అక్రమార్కులను ప్రభుత్వమే సమర్థిస్తుంది అనే భావన ప్రజల్లోకి వెళ్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇలాంటి అక్రమ నిర్మాణాల్లో అధికారిక కార్యక్రమాలు ఏర్పాటు చేయకపోవడమే కాకుండా, అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

## చలపతిరావుకు సిపిఐ నివాళులు

విశాలాంధ్ర - విశాఖ: బిజెపి నేత పివి చలపతిరావుకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి నివాళులర్పించారు. ఈనెల ఒకటవ తేదీన పివి చలపతిరావు మరణించారు. బుధవారం ఆయన శ్రద్ధాంజలి సభకు జేవీఎస్ఎన్‌తో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీఎన్ క్షేత్ర పాల్ తదితరులు హాజరై నివాళులర్పించారు.

## మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలో గల రవీంద్రభారతి పాఠశాలలలో బుధవారం సంక్రాంతి సంబరాలను అంబరాన్నంటేలా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎం.సత్యకళావతి సంక్రాంతి యొక్క విశిష్టత, భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకి తెలియజేశారు. అనంతరం పాఠశాలలో పిల్లలచే ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, భోగి మంటలు, భోగి పళ్ళు పోయడం, పతంగులు తయారు చేయించారు. ఈ వేడుకల్లో ఏడీఎం మూర్తి, డీఐ గోవింద్, పాఠశాల ఇన్‌ఛార్జ్ సిహెచ్. నాగు, ఉపాధ్యాయ సిబ్బంది ఈ.శ్రీనివాస్, కృష్ణవేణి, ఎస్.సునీత పాల్గొన్నారు.

మల్కాపురం: సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తీసుకువెళ్లే వారే మహిళలని కోరమండల్ ఫెర్టిలైజర్స్ ప్రజా సంబంధాల అధికారి యు.ఎస్.శర్మ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని ప్రతి పండుగ ఆధ్యాత్మికతను, ఆరోగ్యాన్ని పెంపొం దిస్తుందని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సంబరాల్లో కోరమండల్ ఫెర్టిలైజర్స్‌కు సంబంధించిన చెందిన వెంకటరమణ, శ్రీ రాజీవ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్షయ ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యం అందరినీ అలరించింది.

గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ బెహర కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. పల్లె ప్రజలు ఆనందోత్సవాలతో 3 రోజులపాటు జరుపుకునే ఏకైక తెలుగు పండగ సంక్రాంతి అని బెహరా కళాశాలల డైరెక్టర్ డా. బెహరా చైతన్య అన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన పలు రకాల ముగ్గులను, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు బాణాల తరుణ్, కర్రి రాజు, ప్రిన్సిపాల్లు సుకన్య, కె.లీలా ప్రసాద్, కామేష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పద్మనాభంలో గల గోస్తనీ విద్యాపీఠం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కాళ్ల పద్మా నగేష్ హాజరై ముందుగా జ్యోతి వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. స్కూల్ పిల్లలతో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం కరస్పాండెంట్ కె.సూర్య వరలక్ష్మి, హెడ్మాస్టర్ ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: కైట్స్ విద్యా విహార్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు కరస్పాండెంట్ రెడ్డి గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు, బొమ్మరిల్లు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, హరిదాసు కీర్తనలతో పాఠశాల ఆవరణంతా పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా తలపించింది. ఈ కార్యక్రమంలో కైట్స్ విద్యా సంస్థల యాజమాన్యం రెడ్డి అప్పలనాయుడు, రెడ్డి చిరంజీవి, రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, రాంబిల్లి వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, డాక్టర్ సుధీర్, రాజేష్ వర్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

## యువశక్తి జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆనందపురం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తల పెట్టిన జనవరి 12న రణస్థలంలో యువశక్తి సభను అందరూ విజయవంతం చేయాలని ఆనందపురం మండల నాయకులు మజ్జి శ్రీనివాస రావు, (రిటైర్డ్ ఆర్మీ) తమ్మిన అప్పలరాజు కోరారు. ప్రజా సమస్యల పట్ల పోరాటం చేసే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని అన్నారు. విద్యార్థులు, యువకులు బంగారు భవిష్యత్తుకు ఒక భరోసా అనేది లేకుండా చేస్తున్న ఈ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

అరకులోయ: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో 12న జరిగే యువశక్తి కార్యక్రమంలో గిరిజన ప్రాంతం నుండి పెద్దఎత్తున యువకులు పాల్గొని విజయవంతం చేయాలని జనసేనపార్టీ నాయకుడు మాదాల శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమస్యలపై వెనుకబాటుతనం, నిరుద్యోగం, ఉపాధి విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలపై జనసేనాని గళమెత్తనున్నారన్నారు.

## దొంగతనాల పట్ల అప్రమత్తంగా వుండాలి

విశాలాంధ్ర - భీమిలి: విశాఖపట్నం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆనందపురం, భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం, దొంగతనాల నివారణకు సంబంధించి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.పండగకు సొంత ఊర్లకు వెళ్లే వారు తగు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం క్రైమ్ ఎస్సై మన్మధుడు, భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి లేని షాపు నిర్మాణం కూల్చివేత

### విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - వీయం పాలెం: వుడా కాలనీ మెయిన్ రోడ్ పాత పోలీస్ స్టేషన్ సమీపంలో ఆంజనేయస్వామి గుడి దగ్గరలో స్క్రాప్ షాప్ స్థానంలో అనుమతి లేకుండా నిర్మించిన షాపు పై విశాలాంధ్ర పత్రికలో ప్రచురితం అయిన కథనానికి స్పందించిన జోన్ 2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ సిహెచ్ రఘునాథరావు ఆధ్వర్యంలో టీపీఎస్ హేమంత్, సిబ్బంది కూల్చివేత చర్యలు చేపట్టారు. ఈ షెడ్డు నిర్మాణం గల స్థలం జిరాయితి భూమిని ఈ సందర్భంగా నిర్ధారించారు. వారం రోజుల్లో షెడ్ నిర్మాణ అనుమతులు తీసుకోవాలని ఈ సందర్భంగా యజమానికి తెలియజేసినట్లు ఏసిపి ఒక ప్రకటనలో తెలియజేశారు. మధురవాడ జోన్ లో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణం చేపట్టిన కూల్చివేతలు తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ప్రతి వార్డుని అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర - నర్సీపట్నం: మున్సిపాలిటీలోని 28 వార్డులను అభివృద్ధి పరిచేం దుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండ ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని 4, 6, 9 వార్డుల్లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. ఆదిలక్ష్మి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే గణేష్ ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరి మణి, అద్దేపల్లి సౌజన్య, వార్డు ఇన్చార్జిలు ఎ.శ్రీనివాస్, ఎ.శేషు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ప్రారంభమైన సంక్రాంతి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ఏజెన్సీలో సంక్రాతి పండగ సందడి ప్రారంభమైంది. ప్రాం తాల వారీగా సుమారు నెల రోజుల పాటు ఈ పండుగను గిరిజనులు జరుపుకుంటారు. పండుగను పురస్కరించుకొని గిరిజన సాంప్రదాయమైన థింసా, విచిత్ర వేషధారణతో సోబోరీ నృత్యాలను ప్రదర్శి స్తుంటారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు గ్రామాలకు తరలి వచ్చి గ్రామస్తులందరితో కలిసి గిరిజన సంప్రదా యమైన థింసా నృత్యాలు ప్రదర్శిస్తూ ఆనందంగా గడుపుతారు. స్థానిక మండలంలోని కించుమండ వారపు సంతలో బుధవారం గిరిజనులు విచిత్ర వేషధారణతో, డప్పు వాయిద్యాలతో సోబోరి నృత్యాలను ప్రదర్శిస్తూ సందడి చేశారు.

## గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని చుక్కపల్లి, అర్జునగిరి గ్రామాలలో పెదగోగాడ పశు వైద్యాధికారిని రాఘవమ్మ ఆధ్వర్యంలో బుధవారం గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. తమ హాస్పిటల్ పరిధిలో గల వివిధ గ్రామాలలో 500 గొర్రెలకు ఈ టీకాలను వేశామని గొర్రెల పెంపకందార్లు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో సాయి రాజేష్ పాల్గొన్నారు.

## చార్మింగ్ కిడ్స్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్: పాయకరావుపేటలో చార్మి కిడ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. పాయకరావుపేట ఎస్ఐ రమేష్ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జె.రవిచంద్రమౌళి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తడి-పొడి చెత్తని వేర్వేరుగా ఇవ్వాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో బుధవారం తడి-పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కార్పొరేటర్ బోండా జగన్నాథం (జగన్) పాల్గొన్నారు. తడి-పొడి చెత్తను వేరు చేయటం వలన, తడి చెత్తని సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగిస్తారని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పొందూరి సింహాచలం, ఏ.యం.హెచ్.ఓ కిరణ్ కుమార్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రీ సర్వేకు సహకరించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: భూములు రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరు తుందని రీ సర్వే స్పెషల్ డీటీ బి.సూరి అన్నారు. బుధవారం మండలంలోని ఆర్ వై అగ్రహారం గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధిలో సమగ్ర భూ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌వై అగ్రహారం గ్రామ పరిధిలో 650 ఎకరాలు భూమిని సర్వే చేయవలసి ఉంటుందని అందుకు రైతులంతా సహకరించాలని కోరారు. రీ సర్వే స్పెషల్ డిటి బి.సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్వో కృష్ణ కుమార్, గ్రామ సర్వేయర్ కేశవ, మండ రమణమూర్తి, మండ మల్లిఖార్జున రావు, గవిరెడ్డి ముత్యాల నాయుడు రైతులు పాల్గొన్నారు.

## జూదాలు నిర్వహిస్తే చర్యలు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు, గొడవలు, జూదాలు లేకుండా పండగ సక్రమంగా జరుపుకోవాలని గ్రామల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ సతీష్ హెచ్చరించారు. కోడి పందేలు, చిత్తులాట, పేకాటలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## ఏసీపీ రమణమూర్తికి ఘనసత్కారం

విశాలాంధ్ర - గాజువాక సిటీ: జీవీఎంసీ గాజువాక జోన్ 6 కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా విశేష సేవలు అందించిన ఐవి రమణమూర్తిని జోనల్ కమిషనర్ సింహాచలం, నూతన ఏసీపీగా నియమితులైన అరుణవల్లి, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ తోపాటు అన్ని విభాగాల అధికారులు ఘనంగా సత్కరించారు. గాజువాక జోన్‌లో రమణమూర్తి సేవలను కొనియాడారు. గాజువాక ప్రాంతంలో అనేక రోడ్ల విస్తరణ కార్యక్రమాలతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులతో సమన్వయంగా పనిచేసిన అధికారిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.

## వీనుల విందుగా కూడారై ఉత్సవం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో కూడారై ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు ధారోత్సవాలు నిర్వహించారు. గంగధార వద్ద గోదాదేవికి పూజలు, అభిషేకాలు చేశారు. మండపంలో ఆశీనులను చేసి తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. ఆస్థానాచార్యులు డాక్టర్ టీపీ.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహితుడు సీతారామాచార్యులు అర్చక పరివారం వేడుకను నిర్వహించారు.

## విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలకు అండగా నిలవండి

విశాలాంధ్ర - చింతపల్లి: విరివిగా విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణలు అన్నారు. స్థానిక మండల కార్యదర్శి పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా విడిపోయి చింతపల్లి వారపు సంతలో మాస్ కలెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలే భారత కమ్యూనిస్టు పార్టీకి అండగా ఉంటారన్న బలమైన విశ్వాసంతో 1925 డిసెంబర్ 26న పార్టీ ఆవిర్భావం మొదలు ప్రజల ఆర్థిక, హార్దిక సహకారంతో నేటికీ 98 ఏళ్లుగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల విరాళాలతోనే దిగ్విజయంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మొట్టడం రాజబాబు, షేక్ రహిమాన్ (బుజ్జి), చింతపల్లి మాజీ ఉపసర్పంచ్ గంజారి రమణ, ఇరువాడ దేముడు, రాజశేఖర్, కె.రాజు, సీనియర్ నాయకులు చిన్నయ్య, కుజ్జన్న పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలపై రూ.16 లక్షలు భారం

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో డ్వాక్రా మహిళలపై సుమారు 16 లక్షల రూపాయలు భారం పడింది. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి, లక్షాధికారులను చేయాలి అన్న ఉద్దేశంతో సీఎం ఆశిస్తున్న తరుణంలో ఒక్కసారిగా డ్వాక్రా మహిళలపై రావికమతం మండలానికి 16 లక్షల రూపాయలు భారం పడడం చాలా విడ్డూరంగా ఉందని పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 1400 స్వ యం సహాయక సంఘాలు (డ్వాక్రా గ్రూపులు ఉం డగా) 16,000 మంది లబ్ధిదారులు ఈ గ్రూపులో ఉన్నారు. ఈ 1400 గ్రూపులను వారి యొక్క గ్రూపు లావాదేవీలను ఆడిట్ చేసేందుకు గాను మండలాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్‌కు ఇద్దరు సీఆర్పీలు చొప్పున నియమించి ఆడిట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీరికి జీతభత్యాలు నిమిత్తం ప్రతి సభ్యురాలు వద్ద వంద రూపాయల చొప్పున వసూలు చేయడం జరుగుతుంది. ఈ డబ్బుతో సీఆర్పీలకు జీతభత్యాలు నిమిత్తం 14 లక్షల 8 వేల రూపాయలు, 1,92,000 రూపాయలు గ్రూపు సభ్యత్వం నిమిత్తం మెత్తం 16 లక్షల రూపాయలు వసూలు చేశారు. దీంతో డ్వాక్రా మహిళపై అధిక భారం పడనుంది. ఆడిట్ చేయడానికి వచ్చిన వారికి మేము జీతాలు చెల్లించడమేమిటని పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీఆర్పీలకు ప్రభుత్వం లేదా మండల, జిల్లా సమైఖ్యల నుంచే జీతాలు చెల్లించాలి తప్ప డ్వాక్రా మహిళలు నుంచి వసూలు చేయరాదని డిమాండ్ చేస్తున్నారు.

## జగనన్న తోడు ఆరవ విడత ఆర్థికసాయం

విశాలాంధ్ర - పాడేరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ వెల్లడించారు. బుధవారం జగనన్న తోడు, ఆరవ విడత ఋణాల పంపిణీ, లబ్ధిదారులకు వడ్డీ జమ కార్యక్రమాన్ని విజయవాడ నుండి ఆయన వర్చ్యువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలో చిరు వ్యాపారులు రుణాలు తీసుకొని సకాలంలో రుణాలు చెల్లించిన వారికి తిరిగి జగనన్న తోడు పథకాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ ఒక్కరి మీద ఆధారపడకుండా జగనన్న తోడు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, స్వయం ఉపాధిగా ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలో 4349 మంది లబ్ధిదారులకు 8,25,336 రూపాయలు వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లించింది. ఈ మేరకు లబ్ధిదారులకు అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ చేతుల మీదుగా చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, డిఆర్డిఏ పిడి వి. మురళి, డిపిఎం ఎస్.వైకుంట రావు, ఏరియా కోఆర్డినేటర్ కృష్ణా రావు పాల్గొన్నారు.

## జగన్‌ను ఓడించేందుకు పెత్తందారులు ఏకం

### ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మీ

విశాలాంధ్ర - జీకేవీధి: పేదలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు పెత్తందారులంతా ఏకమవుతున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆరోపించారు. జీకేవీధి మండలం మొండిగెడ్డ గ్రామ సచివాలయం పరిధిలోని తొట్లగొంది, చెక్కమది, గుడివాడ బూరుగుపాకలు, కొత్తవాడ గ్రామాలలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న వింత పోకడలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ కిముడు శివరత్నం, స్థానిక సర్పంచ్ అడపా ప్రియాంక హరిబాబు, వార్డ్ మెంబర్ నారాయణ, వైసిపి మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, సీనియర్ నాయకులు అడపా విష్ణుమూర్తి, జీకేవీధి ఎంపీటీసీ వసుపులేటి నాగమణి, వైస్ సర్పంచ్ పొత్తూరు త్రిమూర్తులు, వంచుల సర్పంచు వనపల కాసులమ్మ, నాయకులు వనపల రాజేష్, అంజి, బాలకృష్ణ, వార్డు మెంబర్ల బాలన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాల ప్రతిష్ట గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ట గోడపత్రికను ఆవిష్కరించారు. ఇలాంటి కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తున్న మొల్లి ఆనంద్ మిగతా యువకులకు, అయ్యన్న పాలెం గ్రామ ప్రజలకు అమ్మవార్ల ఆశీస్సులు నిండుగా వుండాలన్నారు. ఈ నెల 26న విగ్రహ ప్రతిష్ట జరగనుందన్నారు.

## గ్రామాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - నాతవరం: మండలంలో అన్ని గ్రామాల అభివృద్ధికి అధికారులు శ్రద్ధ చూపాలని నాతవరం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి కోరారు. బుధవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని చెప్పారు. అనంతరం వివిధ శాఖల అభి వృద్ధి వివరాలను ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో వైస్ ఎంపీపీలు పైల సునీలు, మైనం గోపి మండల పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు, జడ్పీటిసి కాపారవు అప్పలనర్స, వ్యవసాయ కమిటీ చైర్మన్ శెట్టి నూక రాజు, ఎంపిడిఒ యాదగిరీ శ్వరరావు, తహశీల్దార్ కనకారావు, హౌసింగ్ ఏఈ జోగారావు పాల్గొన్నారు.

## వైద్యులు అంకిత భావంతో పనిచేయాలి

### ఎంపీపీ బోదెపు గోవింద్



విశాలాంధ్ర -యలమంచిలి రూరల్: మండలంలో గల రేగుపాలెం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం ఎంపీడీఓ జె.ప్రసాద్ రావు, స్థానిక ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బోదెపు గోవింద్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే యూ.వి.రమణమూర్తి రాజు(కన్నబాబు) ఆదేశాలతో యలమంచిలి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేయడంతో ఆయన ఆదేశాలను అనుసరిస్తూ ' సి' గ్రేడ్ లో ఉన్న ఆసుపత్రిని 'బి'గ్రేడ్ వరకు తీసుకురాగలిగానని అలాగే రేగుపాలెం ఆసుపత్రికి తాను చైర్మన్‌గా వ్యవహరిస్తున్నందున పూర్తి బాధ్యత తీసుకుంటున్నానని, ఇప్పటికే ఆసుపత్రి నిర్వహణకి సంబంధించి పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సమావేశానికి ముందుగా ఆసుపత్రిని పరిశీలించిన ఆయన ఇటీవలే యూనిసెఫ్ వారి ఆర్థిక సహాయంతో హ్యాండ్ వాష్ స్టేషన్ ఏర్పాటు చేసిన విషయం తనకి ఎందుకు తెలియజేయలేదని ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఎం.శిరీషని ప్రశ్నించారు. అదే విధంగా ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో స్వీపర్ పై అసహనం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న పలు రికార్డులను తనిఖీ చేసిన ఆయన తీర్మానం పుస్తకంలో ముందు నిర్వహించిన సమావేశానికి సంబంధించి ఎవరి సంతకాలు లేకపోవడంతో ఆ తీర్మాన కాపీని రద్దు చేయాలని ఆదేశించారు. ఆయుష్ డాక్టర్‌ని తన విధులకు హాజరయ్యే విషయంలో ఎంపీపీ ప్రశ్నించగా తాను ప్రతీ రోజు వస్తున్నట్టు చెప్పడంతో ఎంపిపిగా తానే స్వయంగా వచ్చిన రెండు సార్లు మీరు లేరని ఆయనతో అన్నారు. దీనితో డాక్టర్ తీవ్ర స్వరంతో సమాధానాన్ని చెప్పారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇంఛార్జ్ డాక్టర్ ఎమ్.శిరీషా, రేగుపాలెం సర్పంచ్ రాజాన వెంకటమహాలక్ష్మి, కొత్తలి సర్పంచ్ మర్రి రామలక్ష్మి, వైసిపి రూరల్ పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాధ్, ఆసుపత్రి ఫార్మాసిస్టు సుబ్బారావు, ఆసుపత్రి వైద్య సిబ్బంది, వైసీపీ నాయకులు మర్రి రాజు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ డివిజన్ సంఘ అధ్యక్షుడిగా కోటిబాబు

విశాలాంధ్ర - అనంతగిరి: డివిజన్ గ్రామ రెవెన్యూ సంఘ అధ్యక్షులుగా కె.కోటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుమ్మకోట వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కోటిబాబును ఏజెన్సీ 11 మండలాల వీఆర్వోలు డివిజన్ అధ్యక్షునిగా ఎన్ను కున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా పాడేరు వీఆర్‌ఓ రామ జోగారావును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లో వీఆర్వోలు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీలో ప్రపంచ హిందీ దినోత్సవం

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలో మంగళవారం ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసే మాధ్యమంగా హిందీ దోహదం చేస్తుందన్నారు. డైలీ ప్లానింగ్ మీటింగ్‌లలో తప్పనిసరిగా హిందీనే ఉపయోగించాలని ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ జీఎం డిపి పాత్ర ఆదేశించారు. హెచ్ఆర్ హెడ్ రూమాడి శర్మ ప్రపంచ హిందీ ప్రాముఖ్యతను వివరించారు. దీపికా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో అంత్యాక్షరి పోటీలు, ఆన్లైన్ హిందీ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మద్రాస్ ఫిల్టర్ కాఫీ షాపు ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని గోకులపాడు గ్రామంలో డాల్ఫిన్ దాబాలో నూతనంగా మద్రాస్ ఫిల్టర్ కాఫీ షాపును ప్రారంభించారు. షాపును వ్యాపార వేత్త సిహెచ్.గుప్తేశ్వరరావు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త గూడపాటి వేంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, దేశంశెట్టి ఎలయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులో తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాదాన్యతనిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలియజేశారు. వార్డు పరిధిలోని 502 సచివాలయం, పురుషోత్తపురం పరిధిలోని బాలాజీ నగర్‌లో రూ. 2.69 లక్షల వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వారిదు యువజన విభాగం అధ్యక్షులు చిప్పల చందు, పార్టీ నాయకులు అంగడి సూరిబాబు, సాయికృష్ణ, బుజ్జి, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే 97వ వార్డులో పైపులైన్ నిర్మాణ పనులను వార్డు వైసిపి ఇన్చార్జ్ మెంటు మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మెంటు సూరిబాబు, మహాలక్ష్మి నాయుడు, రమణమూర్తి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కారు ప్రమాదంలో నలుగురి గాయాలు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో బుధవారం ఒడ్డిమెట్ట జాతీయ రహదారి వద్ద కారు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు ఒడ్డిమెట్ట గ్రామం వచ్చే సరికి అతివేగంగా పొలంలోకి దూసుకు పోయింది. కారులో ప్రయాణిస్తున్న జి.కోటేశ్వరరావు (50), యం.సూర్యకుమారి (33), యం.ఉత్తమ శ్రీరామ్ తేజ, యం.వెన్య హాసిని తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## చంద్రబాబు, పవన్ కలయికతో వైసీపీ నేతల గుండెల్లో గుబులు..!

విశాలాంధ్ర - భీమిలి: రానున్న ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే వైసీపీ మంత్రులు ప్రతిపక్ష నాయకులపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. ఇద్దరు కలసి కొంతసేపు మాట్లాడుకుంటేనే అధికార పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. రాష్ట్ర మంత్రులు కూడా వారి స్థాయిని మించి మాట్లాడుతున్నారని ఇది సరైనది కాదని అన్నారు. అధికార పార్టీ వ్యక్తిగత సర్వేలో కూడా రానున్న ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి గుబులు పట్టుకుందని అన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులపై ద్వంద్వ వైఖరి మానుకోవాలని హితవు పలికారు.

## జగన్ పాలనకు చరమగీతం పాడాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: ముఖ్యమంత్రి జగన్ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మండలంలోని వజ్రగడ గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్షన్ల విషయంలో జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మూడున్నరేళ్లలో కేవలం రూ.750 మాత్రమే పెంచి పెన్షనర్లకు ఎంతో చేసినట్లు గొప్పలు చెప్పుకుంటు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఆర్వై.పాత్రుడు, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల శేషుకుమార్, కేతిరెడ్డి చిరంజీవి, జోగిపాత్రుడు, అప్పలనాయుడు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ రోడ్డు ఏయూ గ్రౌండ్స్‌లో ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ నగర ప్రజలకు ప్రతి సంవత్సరం ఓ కొత్త అనుభూతిని అందిస్తున్న హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఈ ఏడాది విశాఖ బీచ్ రోడ్లో మొట్టమొదటిసారిగా అండర్ వాటర్ టర్నల్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. దాదాపు నాలుగు కోట్ల రూపాయలు ఖర్చు చేసి విదేశీ టెక్నాలజీతో సుమారు రెండువేల రకాల చేపల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకుడు రాజారెడ్డి తెలిపారు. బీచ్ రోడ్ లోని సబ్మెరైన్ ఎదురుగా పోలీస్ ఆఫీసర్స్ వెనుకాతుల ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేపల ప్రదర్శనతోపాటు 100కు పైగా స్టాల్స్, 12 కు పైగా ఏమ్యూజ్ మెంట్ పార్కులు సందర్శకులకు సరికొత్త అనుభూతినిస్తాయని పేర్కొన్నారు.

## శ్రీ ప్రకాష్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలలో సంక్రాంతి వేడుకలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ కోశాధికారి చిట్టూరి రామ సీత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకలని, అలాంటి పండుగలలో అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. తెలుగు తనం ఉట్టిపడేలా పిల్లలందరూ సంప్రదాయ దుస్తులను ధరించి వివిధ వేషధారణలో, ఆటపాటలతో పండుగ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భానుమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉషారాణి ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అపోలో హాస్పిటల్‌లో ఫుట్ క్లబ్ అవగాహన సదస్సు

విశాలాంధ్ర -విశాఖ సిటీ: అపోలో హాస్పిటల్స్ వద్ద ఫుట్ క్లబ్ ఏర్పాటు చేసారు. అపోలో హాస్పిటల్స్ నందు ఈ క్లబ్ ఏర్పాటునకు కృషి చేసిన పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ ఫుట్ వ్యాధి పిల్లలలో పుట్టుకతో సంభవించు వంకర పాదాలు, ఇది నవజాత శిశువులపైన ప్రభావిత మవుతుంది అన్నారు. అలాంటి చిన్నారుల కోసమే ఈ ఫుట్ క్లబ్‌ను ఒక స్వీయ సహాయక వర్గంగా ఏర్పాటు చేసినట్లు, ఇది తల్లితండ్రులకు ఎంతో ప్రయోజనకారిగా సహాయపడుతుంది అన్నారు. ఈ విధంగా వంకర పాదాలతో జన్మించిన పిల్లలకు వైద్యం చేయించకుండా వదిలేస్తే, అసాధారణ పాదం స్థితి కారణంగా వారు కొన్ని పనులు నిర్వర్తించలేరన్నారు. 2022వ సంవత్సరంలో వైజాగ్ లోని అపోలో హాస్పిటల్స్ నందు వంకర పాదాలు ( క్లబ్ ఫుట్) సవరించు చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ రవిచంద్ర వివరించారు.

## అంబరాన్నంటిన సంక్రాతి సంబరాలు

విశాలాంధ్ర - ఎటపాక : మండల పరిధిలోని శ్రీ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సంక్రాతి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. సంక్రాతిని పురస్కరించుకొని చిన్నారులకు ముగ్గులు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వెంకట్ మాట్లాడుతూ మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం సంక్రాతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకట్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అధాని గ్రూప్‌కి ఇచ్చిన హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం డముకు సంతలో నిరసన చేశారు. ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోడి రాష్ట్రంలో జగన్ ఇద్దరు కలిసి గిరిజన చట్టాలను తుంగలో తొక్కి గిరిజన భూములు అధానికి కట్టబెడుతున్న స్థానిక ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ భాగ్యలక్ష్మిలు నోరు మెదపడం లేదని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, గిరిజన సంఘం నాయకులు గెమ్మెల దేవన్న, పూర్ణనందు, బుద్రయ్య, వెంకటరమణ, మజ్జి అప్పన్న, వార్డు మెంబరు చంద్రన్న పాల్గొన్నారు.

## భాస్కర్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: చట్టివానిపాలెం భాస్కర్ నికేతన్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరిం చారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి, సునీత, పద్మ, సరోజినీ తదితరులు పాల్గొన్నారు. అలాగే 76వ వార్డు గాంధీనగర్ ఏపిగిరీష్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ భీమారెడ్డి, శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ భ్రమరంభ, చిన్నా, పాఠశాల ఇంచార్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సంఘ సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామ రెవెన్యూ సంఘం సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి జరుపుతానని జిల్లా గ్రామ రెవెన్యూ సంఘం ఉపాధ్యక్షురాలు బూర్జ అమ్ములు స్పష్టం చేశారు. ఈ నెల ఎనిమిదవ తేదీన ఆదివారం పాడేరు డివిజన్ కేంద్రంలో గ్రామ రెవెన్యూ సంఘం కార్యవర్గ ఎన్నికలు జరగగా అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయితీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ బూర్జ అమ్ములను జిల్లా ఉపాధ్యక్షురాలుగా రెవెన్యూ సంఘము నాయకులు ఎన్నుకొన్నారు. రెవెన్యూ సంఘం ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారని అటువంటి సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించడానికి తన వంతు కృషి జరుపుతానని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ రెవెన్యూ సంఘం రెండవ ఉపాధ్యక్షురాలు కె నాగమణి, కార్యదర్శి సిహెచ్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఈ క్రాప్, ఈకేవైసీలను త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం జరిగిన నెలవారీ డివిజన్ స్థాయి సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి డి.మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు మండలాలో కూడా పిఎమ్ కిసాన్‌కి సంబంధించి పెండింగ్ నమోదులను ఈ నెల 15వ తేదీ లోపు, రబీలో సాగు చేయు పంటలకు ఈ క్రాప్, ఈకేవైసిల ను ఫిబ్రవరి 15వ తేది లోపు పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. యలమంచిలి సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏ సుమంత మాట్లాడుతూ ఆర్బికేలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సౌజన్య, శంకర్ గోవిందు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - నాతవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని నాతవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం కెఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించారు. జడ్పిటిసి కాపారపు అప్పలనర్స, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, తాండవ రిజర్వాయర్ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపిటిసి అప్పిరెడ్డి మహాలక్ష్మి, మాజీ ఎంపీపీ నేతల విజయ్ కుమార్, మాజీ పీఎస్ఎస్ అధ్యక్షులు శెట్టి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు పైల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర - నక్కపల్లి: అంగన్వాడీ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, అంగన్వా డీలకు కనీస వేతనాలను కల్పించాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్‌కు అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా నక్కపల్లి మండల అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పనిచేసే కార్యకర్తలకు కనీస వేతనాలు కల్పించాలని, అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు దుర్గారాణి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

## కాఫీ, రాజ్‌మాల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - జికే వీధి: ప్రభుత్వం ప్రకటించిన కాఫీ, రాజ్‌మా, చిక్కుల తదితర పంటలకు గిట్టుబాటు ధరలపై కాఫీ, రాజ్‌మా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ జిల్లా టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ గిట్టుబాటు ధరలు లేక ఆదివాసి రైతాంగం నష్టపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గుంట బుచ్చిబాబు, జికేవిది గ్రామ కమిటీ అధ్యక్షుడు అంపురంగి చంటిబాబు, టిడిపి నాయకుడు ఎర్రబాబు, సాగిన చిన్నయ్యపడాల్, జర్త చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో గడపగడపకు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపిడిఓ రామచంద్రమూర్తి, ఉప సర్పంచి కలిగట్ల మాణిక్యం, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకినాయుడు, అల్లాడ నాగరాజు, వెదుళ్ల బంగారి, కర్రి నాగు పాల్గొన్నారు.

## గౌస్ కుటుంబానికి ఆర్థికసాయం



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గత నెల 31వ తేదీన షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో గౌస్ కుటుంబం కట్టుబట్టలతో బయటపడ్డారు. గౌస్ కుటుంబం స్థానిక 30వ వార్డు కుమ్మరివీధి జెండా చెట్టువద్ద సయ్యద్ గౌస్ తన ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. రాష్ట్ర మైనారిటీ శాఖ ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫారుఖీ, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ గౌస్ కుటుంబాన్ని పరామర్శించి 15000/- రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

## అపూర్వ కలయిక



విశాలాంధ్ర - విశాఖ : విశాఖలోని సి బి ఎం హై స్కూల్ లో విద్యనభ్యసించిన (ఎస్ ఎస్ ఎల్ సి) 1964 ఏడాది విద్యార్థుల అపూర్వ కలయికకు స్థానిక దసపల్లా హెూటల్ వేదిక అయ్యింది. నాటి తరగతి విద్యార్థులు ఎక్కడెక్కడో వివిధ హెూదాలో స్థిరపడ్డారు. వీరంతా సమావేశమై పిచ్చాపాటి కబుర్లు చెప్పుకొంటూ నాటి మధుర జ్ఞాపకాల్లో తేలియాడారు. వీరందురు ఓ అసోసియేషన్ గా ఏర్పడ్డారు. అధ్యక్షుడిగా బీ సీహెచ్ మసేన్, కార్యదర్శిగా కంకటాల ప్రభాకర్‌లు ఎన్నికయ్యారు. అసోసియేషన్ ద్వారా ఇప్పటివరకు చాలా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని మసేన్ తెలిపారు.

## యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: మండలం కొండపల్లి గ్రామా నికి చెందిన కుంజం వంశీకృష్ణ తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజవొమ్మంగి ఎస్ఐ టిజిఎస్ ప్రసాద్ తెలిపిన వివరాలు అగ్రికల్చర్ బిఎస్సీ చదువుకొని ఖాళీగా తిరుగు తుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఎవరూ లేని సమయంలో పురుగు మందు సేవించి మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ధర్మాన వ్యాఖ్యలు వ్యక్తిగతమా..? వైసీపీ నిర్ణయమా ?

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో విచ్చిన్న ఉద్యమాలకు వైసీపీ తెర లేపుతుందని, ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రం కావాలని మంత్రి ధర్మాన డిమాండ్ పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోరు విప్పాలని, 2024కి జగన్ మోహన్ రెడ్డి అజెండా ఏమిటో చెప్పాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. "మంత్రి ధర్మాన వాక్యాలు చూస్తే 2024 నాటికి రెండు రాష్ట్రాలు లేదా మూడు రాష్ట్రాలు చెయ్యాలనుకుంటున్నారా? శాసనసభలో తీర్మానం పెట్టి కేంద్రానికి పంపిస్తారా? ఈ రాష్ట్రంలో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేం దుకు మంత్రి కారకుడవుతున్నాడు. 2024లో జగన్, మంత్రి ధర్మాన అజెండాలు ఒకటేనా? మంత్రి వ్యాఖ్యలు వ్యక్తిగతమా? లేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీవా లేక ప్రభుత్వానిదా చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మానను మంత్రివర్గం నుంచి తొలగిం చాలని, వైసీపీ ఉత్తరాంధ్రకు చేసిందేమిటో శ్వేత పత్రం విడుదల చేయగలరా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడటంలో ప్రభు త్వం విఫలం అయిందన్నారు. హిందూ దేవలయాలపై దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదు అన్నారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - అనంతగిరి: అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలను అందించడంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నూరు శాతం చిత్తశుద్దిని పాటించినట్లు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని జీనబాడు పంచాయతీ సచివాలయం(కోడ్: 10390631) పరిధికి చెందిన గంగవరం, బెంబి, పాలబంధ గ్రామాల్లోని 266 గడపలను సందర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీనబాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ సాలుగు మాధవి, పినకోట ఎంపీటీసీ రంసాల వెంకట రామలక్ష్మి, అనంతగిరి మండల వైసీపీ అధ్యక్షులు శెట్టి ఆనంద్, పెదకోట ఎంపిటిసి సభ్యురాలు శిరగం శ్రావణి, పినకోట గ్రామ పంచాయతీ సర్పంచ్ గణేష్, మాజీ ఎంపిటిసి సభ్యురాలు సలుగు దేముడమ్మ, అనంతగిరి సోషల్ మీడియా కన్వీనర్ పాంగి సత్యనారాయణ, కో-కన్వీనర్ రుడి లక్ష్మణరావు, నాయకులు రామసాల రామన్న దొర, పాంగి కోటేశ్వరరావు, టోకూరు దేముడు, సలుగు గంగునాయుడు, బాడం నాగేశ్వరరావు, రమణ, గంగరాజు, నాయుడు, భీమన్నదొర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వందే భారత్ రైలు ట్రయల్ రన్ సక్సెస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల మధ్య తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్ నిమిత్తం గురువారం విశాఖపట్నం విజయవంతంగా చేరుకుంది. దూరంతో రైలు కంటే వేగంగా పరుగులు పెట్టే వందే భారత్ ఎక్స్ ప్రెస్ అనకాపల్లి వద్ద 149 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. ఈనెల 19 నుండి ప్రారంభం కావలసిన వందే భారత్ ఎక్స్ ప్రెస్ ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో ఈ ప్రారంభోత్సవం వాయిదా పడినట్లు తెలిసింది. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో విజయవంతంగా గురువారం నిర్వహించిన వందే భారత్ ట్రయల్ రన్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని రైల్వే అధికారులు తెలియజేశారు. కేవలం 8.40 గంటల వ్యవధిలోనే విశాఖ గమ్యం చేరుకుందని తెలియజేశారు. టెస్టింగులు పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంగా సికింద్రాబాద్ ఈ రైలు వెళ్లిపోయింది. ప్రతిరోజు ఉదయం 5:45 గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 2.25 గంటలకు కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 20 నిమిషాలు విరామం తర్వాత 2. 45 నిమిషాలకు సికింద్రాబాద్ లో బయలుదేరి విజయవాడకు రాత్రి 7:10 నిమిషాలకు చేరుకోని, విశాఖపట్నం రాత్రి 11: 25 నిమిషాలకి చేరుకుంటుంది. ఒకేరోజులో విశాఖపట్నం నుండి హైదరాబాదు వెళ్లి తిరిగి వచ్చేలా ఈ రైలు ప్రయాణం ఉండడం విశేషం.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కరవు

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిసౌకర్యాలు కరువుతో అల్లాడుతుందని నాలుగు రోజులు పర్యవేక్షణలో ఏఐవైఎఫ్ నాయకులు గమనించారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రాధాకృష్ణ అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వర్తింప చేయాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఆరోగ్యశ్రీ వర్తింపు పథకం చాలా ఆశ్చర్యంగా ఉందని, ఈ రాష్ట్ర ప్రభుత్వం అతికి తెలివితేటలు మానుకొని సేవలందిస్తున్న డాక్టర్స్ ఇతర సిబ్బందికి జీతాలు పెంచి ప్రమోషన్ ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డ్స్, చెత్త, పరిశుభ్రత చేసే వాళ్ళకి, 108, 104, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఇతరత్రా సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు లేక కుటుంబాలతో ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పనిచేసే ఉద్యోగస్తులకు, పెన్షన్ దారులకు ప్రతినెల 1వ తేదీకి జీతాలు ఇవ్వాలని.ప్రభుత్వ కార్యకలాపాలను ఉపయోగిం చుకున్న సిబ్బందికి జీతాలు వేయకుండా ఇబ్బంది పెడితే ఈ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో మిగిలిపోతారు అని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొవాలని లేని పక్షంలో ప్రజా సంఘాలు కలుపుకొని అఖిల భారత యువజన సమాఖ్యగా ఉద్యమాలు చేపడతామని అన్నారు.

## అరకులో అపరిచిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని అరకు సంతబయలులో గుర్తుతెలియని అపరిచిత వ్యక్తులు సందర్శించి చోరీలకు పాల్పడుతున్నారని తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గుర్తుతెలియని బయట వ్యక్తులు రాత్రి వేళల్లో ఆ గ్రామంలోనున్న సంత షెడ్లు వద్ద నిత్యం తిష్ట వేసి ఉంటున్నారని, మీరెవరిని అడిగితే అడిగిన వారిపై దురుసుఖ ప్రవర్తించి దాడులకు పాల్పడుతున్నట్లు స్థానిక గ్రామ వర్తక సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు చెప్పారు. తక్షణమే పోలీసు అధికారులు స్పందించి అపరిచిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కె.నగేష్, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి వాసు, నాయకులు పాల్గొన్నారు.

## 342 ఆర్టికల్‌కు విరుద్ధంగా వలసలను కలపడం తగదు

విశాలాంధ్ర - చింతూరు: వలస వచ్చిన వలస బెంతు ,పోర్జలు ,గౌడలను ఎస్టీలో 342 ఆర్టికల్‌కు విరుద్ధంగా ఎలా కలుపుతారని వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుతూ చింతూరు మండల ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కుంజా అనిల్ బృందం సబ్ కలెక్టర్ మేజిస్ట్రేట్‌ను కలిశారు. రాష్ట్ర శాసన మండలి సభ్యురాలు కనీసం అవగాహన లేకుండా యస్టిలో చేర్చాలి అనడం, దానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గ్రామసభ నిర్వహించడం భారత రాజ్యాంగం పైన అవగాహన లేదని వివరించారు. కూనవరం మండలంలో అర్ యం పి ముత్యాల శ్రీనివాసరావు కుటుంబీకుల నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కుంజా బాలు ,సవలం రమేష్, సవలం ఉదయ్ ,కారం వెంకట్ , సోడె ముత్తయ్య మోతుగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మన రాష్టానికి ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం 61వ వార్డు బూత్ నెంబర్ 137 లో ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం టిడిపి పార్టీ బూత్ కన్వీనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వార్డ్ అధ్యక్షుడు మజ్జి సోమేష్, ప్రధాన కార్యదర్శి గాదం బోయిన జయశంకర్, వార్డు మహి ళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, కాకి పోల్ రెడ్డి, చింతల పూడి సత్యనారాయణ, అంజూరి సన్యాసి రావు, పొనుగంటి శ్రీను, కైలాస్, తరుణ్ పాల్గొన్నారు.

## విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -దేవరాపల్లి: మండల కేంద్రము అయినా దేవరాపల్లి స్థానిక పోలీస్ స్టేషన్ యస్సై డి. నాగేంద్ర చేతుల మీదుగా విశాలాంధ్ర తెలుగు దినపత్రిక 2023 సంవత్సర క్యాలెండర్ బుధవారం ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా యస్సై నాగేంద్ర మాట్లాడుతూ విశాలాంధ్ర తెలుగు పత్రిక 1952 స్థాపించిన నాటి నుండి నేటి వరకు 70 సంవత్సరాలు పూర్తి చేసుకొని తెలుగు ప్రజల ఆధర అభిమానాలను పొందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెస్ విజేత గణపతికి అభినందన

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం గొన్న ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కె.గణపతి ఇటీవల జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ చెస్ టోర్నమెంట్‌లో రన్నర్‌గా నిలిచారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కె.గణపతిని కళాశాల మేనేజ్మెంట్ అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ గొన్న హేమచంద్ నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి విజయం సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.ఎస్.ఎన్. మూర్తి, విభాగాధిపతులు అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ముమ్మన జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: వైసీపీ సీనియర్ నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు జన్మదిన వేడుకలు బుదవారం ఘనంగా జరిగాయి. అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్చార్జి అన్నం రెడ్డి అజయ్ రాజ్, వేగి శ్రీనివాసరావు, మెంటి మహేష్ సహా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కమిటీ ముమ్మనను ఘనంగా సన్మానించింది. రోమాల నూకరాజు స్నేహ మిత్ర హెల్పింగ్ హాండ్స్, మురళి స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆకార్ అనాధ బాలికల ఆశ్రమం పిల్లలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేసారు.

## శ్రీరామ నామ స్మరణమే వీరి లక్ష్యం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలం ముద్దుర్తి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యవర్గం రేజేటి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ రామ నామ తారక మంత్రమే లక్ష్యంగా హరినారాయణ భజనలతో బుధవారం వేకువ జాము 5 గంటల నుండి మేలుకొలుపులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా గురుదేవులు చారి మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ సత్యనారయణ మాష్టారు, దుద్దుపాలెం సర్పంచ్ కూర్మదాసు మాలిబాబు స్వామి, రమా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు అండగా జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర - దేవీపట్నం : పోలవరం ముంపు నిర్వాసితులకు జగన్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మీ అన్నారు. బుధవారం ఇందుకూరుపేట గ్రామంలో నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం కొత్తగా నిర్మించిన సచివాలయం నూతన భవనంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుంజం మురళీ, జెడ్పీటీసీ శీర్షం సత్యవేణి, వైఎస్ ఎంపిపి గారపాటి మురళీ కృష్ణ, వైసిపి నాయకులు కందుల బాబ్జీ, పోలిశెట్టి శివ రామకృష్ణ, కట్టా సత్తిబాబు, సర్పంచులు కారం కృష్ణ బాబు, కొమరం లక్ష్మీ దేవి, కొమరం శ్రీనివాస్ దొర, పూసం వెంకట్రావు, కొమరం భాస్కర రావు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులు వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: ఈనెలలో 15 రోజుల దాటినా నేటికీ 25% కూడా కార్డుదారులకు రేషన్ అందలేదని, మిగతా 75 శాతం ప్రజలు ఏమి తిని సంక్రాంతి పండుగ చేసుకుంటారని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనకుమారికి సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, కోరుమిల్లి శంకర్రావు, ఎం.సత్యనారాయణ, వి.కాసుబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొలతల హరినాథ్ బాబు, ,ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కలిసిట్టి సురేష్ బాబు వినతిపత్రం అందజేశారు. పండగలోపే రేషన్ సరుకులు అన్ని కార్డుదారులకు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## రాములమ్మ దీక్ష విరమణ

విశాలాంధ్ర - కూనవరం: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాములమ్మ తలపెట్టిన మౌన దీక్షను పాయం రవివర్మ నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఆమె దీక్షకు మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు బిజెపి నాయకులు పాయం వెంకయ్య, సోడే వెంకయ్య, ఏవిఎస్పీ నాయకులు కుంజా అనిల్, కారం రవి కారందారయ్య సంఘీభావం తెలిపారు.

## నాటువైద్యం జోలికి వెళ్లొద్దు

విశాలాంధ్ర - సీలేరు: ఆదివాసీలు నాటువైద్యం జోలికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు సూచించారు. జీకేవీది మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధి చింతగుప్ప గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సిబ్బంది చూడరాయి వరకు వారి వాహనంలో వెళ్లి, అక్కడినుంచి 3 కిలోమీటర్ల కాలినడకన చింతగుప్ప గ్రామానికి చేరుకుని 89 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాణి, హెల్త్ సూపర్‌వైజర్ పోతురాజు, ఎంఎల్ హెచ్ పి.నాగమణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలకు రక్షాకవచం జిఓ నెంబర్ 1

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబర్ 1 నిలుస్తుందని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఏయూ టిఎల్ఎన్ సభామందిరం వేదికగా ఆంధ్రవిశ్వ విద్యాలయం, విశాఖ నగర మేధావుల వేదిక నిర్వహించిన 'ప్రజల ప్రాణాలకు రక్ష జి.ఓ నెంబర్ 1' రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల ప్రాణాలను రక్షించాలనే ఏకైక లక్ష్యంతో తీసుకువచ్చిన జిఓ నెంబర్ 1ని తామంతా స్వాగతిస్తున్నామని స్పష్టం చేసారు. ఈ సందర్భంగా ఏయూ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ జిఓ నెంబర్ 1 ఎవరి స్వేచ్ఛను హరించలేదని, మన బాధ్యతను గుర్తుచేసిం దన్నారు. ఈ జిఓను వ్యతిరేకించడం మన బాధ్యతను మనం విస్మరించడంతో సమానమన్నారు. ఇటీవల జరిగిన కందుకూరు, గుంటూరు సంఘటనల్లో ప్రాణాలో కోల్పోయిన వారిని మనం వెనక్కి తీసుకు రాలేమన్నారు. ఈ సమావేశంలో ఏయూఆర్ట్స్, కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామ మూర్తి, బిసిడిఈ సమన్వయకర్త ఆచార్య ఎన్.ఏ.డి పాల్, ఏయూ కామర్స్ మేనేజ్ మెంట్ విభాగం గౌరవ ఆచార్యులు పి.విశ్వ నాథం, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, సోషల్ వర్క్ గౌరవ ఆచార్యులు పి.అర్జున్, క్రీడా విభాగ ఆచార్యులు ఎన్.విజయమోహన్, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు, ఆచార్య ఎన్.సత్యనారాయణ, ఏ.కె.ఎం పవార్, డాక్టర్ రాజమాణిక్యం, డాక్టర్ శ్రీనివాస్,న్యాయవాది చిన్నారావు, తదితరులు ప్రసంగించారు.